కాంగ్రెస్, బీజేపీ నేతలను తరిమి కొట్టండి

- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సురేందర్ పిలుపు
- రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచన


దేమికలాన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

తాడ్వాయి: అబద్ధాలు చెబుతూ గ్రామాలకు వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను తరిమి తరిమి కొట్టాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఆ రెండు పార్టీలో దొందూ దొందే అన్నారు. మండలంలోని దేమికలాన్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వాటిని సద్వినియోగం చేసుకునేలా వివరించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందుతోందని ఆయన పేర్కొన్నారు.

రైతుబంధు, రైతు బీమా పథకాలతో రైతులకు ఎంతో ఉపయోగం అన్నారు. అనంతరం 2001 ఏడాది నుంచి పార్టీలో పని చేసిన వారిని సన్మానించారు. అంతకు ముందు మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, ఎంపీపీ కొడి రవి, జెడ్పీటీసీ రమాదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింలు, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పనులతో గిరిజన తండాల్లో వెలుగులు

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

మాచారెడ్డి: గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు చేపట్టి వెలుగులు నింపుతున్నట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో రూ.8.82 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆహ్లాదాన్ని పంచే విధంగా పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, వైకుంఠధామాలు, సిమెంటు, బీటీ రోడ్లు వేశామన్నారు. గజ్యానాయక్ తండా, బంజెపల్లి తండాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఆయన ప్రారంభించారు. సోమారంపేట, సర్దాపూర్ తండా, మగ్రితండా, నెమిలిగుట్ట తండాల్లో పల్లె ప్రగతి పనుల్లో భాగంగా సిమెంటు రోడ్లను ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సోమారంపేట, బంజెపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తానమన్నారు. అర్హులైన రైతులందరికీ రైతుబంధు ఇస్తామన్నారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగరావ్, జెడ్పీటీసీ మిన్కూరి రాంరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు, సింగిల్ విండో చైర్మన్ పూల్‌చంద్ నాయక్, వైస్ ఎంపీపీ జీడిపల్లి నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు హంజీనాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాల్‌చంద్రం, ఉపాధ్యక్షుడు రాజాగౌడ్, నాయకులు బూక్య నర్సింలు, శ్రీనివాసచారి, మద్దెల రాజు, అజీజ్, కిషన్, శ్రీధర్‌రావ్, బూస శ్రీనివాస్, ఎడపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌కు వీడ్కోలు



బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో సాంఘికశాస్త్రం టీచర్‌గా పని చేస్తున్న విజయలక్ష్మికి మంగళవారం వీ డ్కోలు పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరమణారావు, ఎస్ఎంసీ చైర్మన్ ఈశ్వర్‌గౌడ్ తదితరులు టీచర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చారి, ఉపాధ్యాయులు అంజ య్య, నర్సింగ్‌రావు, రాజు, దుర్గారావు, ప్రసా ద్, ప్రేమ్, తస్నీన్, సౌజన్య ,శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ



ఎల్లారెడ్డి: ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తామని ఆ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి మహేష్ వెల్లడించారు. మంగళవారం ఎల్లారెడ్డిలో నియోజకవర్గం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు, ఇంటింట టీడీపీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బాలకిషన్, రవీందర్‌రెడ్డి, గోపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ


పంపిణీ చేసిన పరీక్ష ప్యాడ్‌లతో మర్కల్ విద్యార్థులు

సదాశివనగర్: మండలంలోని మర్కల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు రాంసింగ్ గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్‌ఎం శివప్రసాద్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు అశోక్ సింగ్, ప్రభులింగం తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలోని పాల్వంచ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శ్రీ ఆర్యభట్ట ఎడ్యుకేషనల్ గ్రూప్ చైర్మన్ గురువేందర్‌రెడ్డి ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం జఠాలాల్, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింలు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్కే విద్యా సంస్థల చైర్మన్ జైపాల్ రెడ్డి పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గంగా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిజామాబాద్‌కు చెందిన సీతయ్య ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నాగిరెడ్డిపేట: ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీడీ కార్మికులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సొంత ఇల్లు లేక అద్దె ఇంటిలో ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొటున్నామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మస్రూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


వీడ్కోలు సమావేశంలో సదాశివనగర్ విద్యార్థులు

సదాశివనగర్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్, విండో చైర్మన్ కమలాకర్ రావు, హెచ్‌ఎం ప్రేమ్‌దాస్, ఎస్ఎంసీ చైర్మన్ బల్‌రాం రెడ్డి పాల్గొన్నారు.

గాంధారి: పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ ఎం రంగా వెంకటేశ్వర్ గౌడ్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

బాన్సువాడ : ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీ చేయాలని బాన్సువాడ సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక సహకార సంఘం కార్యలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి కృషి చేసిన డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నారాయణరెడ్డి, కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, గడుమల లింగం, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

గాంధారి: సహకార సంఘంలో రైతులకు అన్ని రకాల సేవలు అందించాలని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం చైర్మన్ సాయి కుమార్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో సీఈవో మోహన్ రెడ్డి సంఘం పద్దులను వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉద్దల్ సింగ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు తప్పనిసరి


కుర్లాలో కంటి వెలుగు శిబిరంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్

మద్నూర్: ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సూచించారు. డోంగ్లీ మండలంలోని కుర్లా గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని, డోంగ్లీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కంటికి శస్త్ర చికిత్సలు అవసరం ఉంటే ప్రభుత్వ ఖర్చుతోనే చేయించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట తహసీల్దార్ కాంత్రికుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రాహుల్ ఎంపీ సభ్యత్వం రద్దు సరికాదు


పెద్దకొడప్‌గల్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సొదాగర్ గంగారాం


బాన్సువాడలో కాసుల బాల్‌రాజ్..

పెద్దకొడప్‌గల్: రాహుల్ గాంధీ ఎంపీ సభ్యత్వం రద్దు చేయడం సిగ్గుచేటు అని కేంద్రంపై కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే సొదాగర్ గంగారాం ధ్వజమెత్తారు. మండలంలోని గాంధీ చౌరస్తాలో పార్టీ నేతలతో కలిసి ఆయన సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నండి ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డివిరిస్తున్నారని ఆరోపించారు. దేశం గర్వించే విధంగా రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ప్రజలు నీరాజనాలు పలికారని అన్నారు. దేశానికి ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా ఆ పదవికి దూరంగా ఉన్నారని, అది రాహుల్ గాంధీ కుటుంబానికి ఉన్న చరిత్ర అన్నారు. అనంతరం వడ్లం బీజేపీ ఫ్లోర్ లీడర్ నగారాజ్, పిట్లం మండలానికి చెందిన బీజేపీ మోర్చా అధ్యక్షుడు లాలసింగ్ కాంగ్రెస్‌లో చేరారు.

బాన్సువాడ : పట్టణంలోని గాంధీ చౌక్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్యాగ్రహ దీక్షలో బాన్సువాడ కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జి కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అనగదొక్కుతోందన్నారు. కేంద్రం అవలంభిస్తున్న విధానంతో దేశంలో కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంత్రి గణేష్, హన్మండ్లు, మనోహర్, మధుసూదన్‌రెడ్డి, గుడాల నగేష్, కాంత్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్, నారాయణ, నబి, అఫ్రోజ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: రాహుల్ గాంధీ సభ్యత్వ రద్దును నిలిపివేయాలని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడుతూ మోదీ పరిపాలన నిరంకుశత్వాన్ని తలపించేలా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, అఫీజ్, గోవింద్, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి తదితరులు

సామాజిక న్యాయం కోసం పోరాటం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

లింగంపేట: సామాజిక న్యాయం కోసం పోరాటం నిరంతం కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ వెల్లడించారు. మంగళవారం ఆయన మండలంలోని పొల్కంపేట గ్రామంలో జనచైతన్య యాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుధవారం హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద జరిగే భహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, ఏఎంసీ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పద్మ, నాగరాజు, ఉప సర్పంచ్ రామానుజచారి, సత్యం, రమేశ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఎదుగుదల


ఎల్లారెడ్డిలో గర్భిణులకు పోషకాహారం ఇస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని నీలకంఠేశ్వరాలయం, బాలాజీనగర్ తండా అంగన్‌వాడి కేంద్రాలలో పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించి, పోషకాహారాన్ని అందించారు. తృణధాన్యాలను తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య తొలగిపోతుందని సీడీపీవో పద్మ అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడి టీచర్లు సుమిత్ర, లలిత, దేవకర్ణ పాల్గొన్నారు.

రామారెడ్డి: మండల పరిధిలో గల గొల్లపల్లిలో అంగన్‌వాడి కేంద్రాన్ని సర్పంచ్ లావణ్య తనిఖీ చేసి న్యూట్రిషన్ల కిట్లను అందజేయాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ లావణ్య, అంగన్‌వాడి సూపర్‌వైజర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ: నస్రూల్లాబాద్ మండలంలోని హాజీపూర్ అంగన్‌వాడి కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్ అంజయ్య పోషకాహారం వల్ల కల్గే ప్రయోజనాల గురించి వివరించారు. పాఠశాల హెచ్‌ఎం పర్వయ్య, అంగన్‌వాడీ టీచర్లు వినోద, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

- పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణానికి రావాలని 'విప్'నకు ఆహ్వానం



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామంలో శ్రీ నవదుర్గ పెద్దమ్మ దేవి 20వ వార్షికోత్సవం, పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవానికి రావాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్, సింగిల్ విండో డైరెక్టర్ బక్కన్నగారి రాజు, మాజీ ఎంపీటీసీ బాలరాజు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు స్వామి, సభ్యులు బాల్ నర్సింలు, బాలయ్య గంగాధర్, నర్సింలు పాల్గొన్నారు.

- **బ్రహ్మోత్సవాల కోసం ఎస్పీకి..**

రామారెడ్డి: మండల కేంద్రంలోని పురాతన శ్రీ సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి మంగళవారం కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. సర్పంచ్ సంజీవ్, ఆలయ కమిటీ చైర్మన్ రంగు రవీందర్ గౌడ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఉస్కె సాయిలు, మహిపాల్, బాల్ దేవ్ అంజయ్య, శ్రీనివాస్ , గురజాల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

- **ముగిసిన అఖండ హరినామ సప్తాహం**

పెద్దకొడప్‌గల్: మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో విఠల్ మహరాజ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహం కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఎమ్మెల్యే హన్మంత్ సింధే హాజరై హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

- **ఆలయ అభివృద్ధికి కృషి**



సదాశివనగర్: మండలంలోని వజ్జపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రం నర్సయ్య, ఉప సర్పంచ్ ప్రభాకర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేందర్, ఎర్రం రాములు, నాయకులు శ్రీనివాస్, రాం రెడ్డి, సత్యం రావు, భాస్కర్, రాజు, రామారావు, శివకుమార్ పాల్గొన్నారు.

సుభాష్‌రెడ్డి ప్రత్యేక పూజలు..

శివ పార్వతుల కల్యాణ వేడుకల్లో కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జి వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నాయకులు నరేశ్ గౌడ్, సంతోష్ పాటిల్, చిన్నన్న, జైపాల్ రెడ్డి ఉన్నారు.

- **హన్‌మాన్ విగ్రహ పునః ప్రతిష్ఠాపన**



తాడ్వాయి: మండల కేంద్రంలోని హన్‌మాన్ ఆలయంలో విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- **కాళికదేవి ఆలయంలో పూజలు**



భిక్కనూరు: మండల కేంద్రంలోని కాళికదేవి ఆలయంలో సర్పంచ్ తున్కి వేణు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ మనుమయ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్‌తో పాటు ఎస్సై ఆనంద్‌గౌడ్‌ను సన్మానించారు.

క్లుప్తంగా

పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ

బిచ్కుంద: మండలంలోని హజ్గుల్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి మంగళవారం ఎంపీపీ అశోక్ పటేల్ భూమి పూజ చేశారు. మండలంలో ఒక్కో పంచాయతీ భవనానికి రూ. 20 లక్షల ప్రకారం 12 పంచాతీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించి వంద శాతం నీటి సమస్య పరిష్కరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మారుతి, బీఆర్‌ఎస్ నాయకులు నాల్చర్ రాజు, వెంకట్‌రావు, మల్లికార్జున్, షబ్బీర్ పాల్గొన్నారు.

వాహనాల పన్ను చెల్లించాలి

ఎల్లారెడ్డిరూరల్: ట్యాక్సీ వాహనదారులు త్రైమాసిక పన్నులను ఈ నెలాఖరులోగా చెల్లించాలని ఏఎంవీఐ విక్రమ్ సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డిలో ఆయన వాహనాలను తనిఖీ నిర్వహించారు. త్రైమాసిక పన్నులను గడువులోగా చెల్లించకపోతే 200 శాతం అదనపు మొత్తం చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

వసతి గృహ నిర్మాణ పనుల పరిశీలన



బాన్సువాడ రూరల్: నస్రుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ మహిళా కళాశాల వసతి గృహ నిర్మాణ పనులను మంగళవారంస్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం నర్సింగ్ కళాశాల అధ్యాపకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

అదుపుతప్పితే అంతే!



బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామం వద్ద కామారెడ్డి, సిద్దిపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ప్రమాదకరంగా బావి ఉన్నా వాటిని పూడ్చే ప్రయత్నం చేయలేదు. దీంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆయుష్మాన్ భారత్ నమోదు కేంద్రం ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని 39వ వార్డులో కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఉచిత నమోదు కేంద్రాన్ని మంగళవారం బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి ప్రారంభించారు. తెలుపు రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఆయుష్మాన్ భారత్ పథకం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని కార్డు పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటూరి శ్రీకాంత్, వేణు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తా వద్ద సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంత ప్రజలే మోసపోతున్నారని అన్నారు. ఫోన్‌కు ఏమైనా ఓటీపీలు వస్తే వెంటనే డిలీట్ చేయాలని సూచించారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



గాంధారి: మండల ఎస్సైగా సుధాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్సై మీడియాతో మాట్లాడుతూ ఎవరైనా నేరుగా స్టేషన్‌కు వచ్చి సమస్యలు విన్నవించుకోవచ్చని సూచించారు. మధ్యవర్తులతో కలిసి సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నియామకం



కామారెడ్డి టౌన్: కురుమ యువ చైతన్య సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంబల్ల సాయి నిఖిల్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురుమ కుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సంక్షిప్తం

పందుల నివారణకు తీర్మానం

దోమకొండ: మండల కేంద్రంలో పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయితీ పాలకవర్గం తీర్మానించింది. ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ఈవో సౌజన్య, వార్డు సభ్యులు బొమ్మెర శ్రీను, చింతల రాజేష్, సిద్దరాములు, చింతల జనార్ధన్, బుర్రి రవికుమార్, వరలక్ష్మి, అనుమాల లక్ష్మి, మద్దూరి అరుణ పాల్గొన్నారు.

దొంగల వద్ద బంగారం కొంటే చర్యలు

కామారెడ్డి అర్బన్: దొంగల వద్ద బంగారం కొనే వ్యాపారులు చర్యలు తీసుకుంటామని సువర్ణ, రజిత, రత్న, ఆభరణ వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అవుసుల రాములు, నితిన్‌జైన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

సామూహిక సీమంతాలు

నిజాంసాగర్: మండలంలోని దూప్‌సింగ్ తండా అంగన్‌వాడి కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బంది సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం పౌష్టిక అహార సరుకులను అందజేశారు. సర్పంచ్ చెందర్‌రాథోడ్, సూపర్ వైజర్ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

8న రెడ్ల ఆత్మీయ సభ

కామారెడ్డి టౌన్: రెడ్ల ఆత్మీయ సభ వచ్చే నెల 8న కామారెడ్డి పట్టణంలో నిర్వహించనున్నట్లు రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన విద్యార్థులు దుర్కి గ్రామంలో అంగన్‌వాడి కేంద్రం, హెల్త్ సబ్‌సెంటర్, రామాలయం పరిసరాలను శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ గంగాధర్, ప్రోగ్రాం అఫీసర్ శ్రీనివాస్, సర్పంచ్ శ్యామల పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ కార్యక్రమం

బాన్సువాడ రూరల్: బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్రీలేఖ 89 మంది మహిళలలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

జీవాలకు నట్టల నివారణ మందు

మద్నూర్: గొర్రెలు, మేకలకు నట్టాల నివారణ మందులు వేయించాలని మేనూర్ పశువైద్యాధికారి బండివార్ విజయ్ సూచించారు. మండలంలోని కోడిచిరలోని పశువైద్యశాలలో జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్ పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

భిక్కనూరు: మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపై రెవెన్యూ సిబ్బంది మంగళవారం విచారణ నిర్వహించారు. దరఖాస్తుదారుల స్థితిగతుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి అశోక్, వీఆర్ఏ గడ్డం శ్రీకాంత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌పై అవిశ్వాసం

నాగిరెడ్డిపేట: గోపాల్‌పేట ఉప సర్పంచ్ కోనేటి దుర్గేష్‌పై వార్డు సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో శ్రీనునాయక్ బలపరీక్ష నిర్వహించారు. 10 మంది వార్డు సభ్యుల్లో అవిశ్వాస పరీక్షకు 8మంది మద్దతు తెలిపారు. ఉప సర్పంచ్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై కోర్టులో కేసు ఉన్నందున ఫలితాన్ని వెల్లడించడంలేదని ఆర్డీవో తెలిపారు.